వైభవంగా విజయదశమి



అమ్మవారి అవతారంలో చిన్నారి

దసరా వేడుకలను గురువారం అంగరంగవైభవంగా జరుపుకున్నారు. తెల్లవారు జాము నుంచే ఆలయాల్లో భక్తుల పూజలు, ఆయుధ పూజలతో కిక్కిరిసి పోయాయి. సాయంత్రం వేళల్లో పాలపిట్టను దర్శించుకోవడంతో పాటు వేద పండితులు మంత్రోచ్ఛరణల నడుమ శమీ పూజ చేసి ఉత్సవ విగ్రహాలను డప్పు వాయిద్యాలు, కోలాటాల నడుమ ఊరేగించారు. రావణ దహనాన్ని ఉత్సాహంగా జరిపారు. ఈ సందర్భంగా టపాసులు పేలుస్తూ కేరింతలు కొడుతూ సందడిగా గడిపారు. పలు చోట్ల సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



రఘునాథపాలెం: పోలీస్ స్టేషన్‌లో ఆయుధ పూజ



నేలకొండపల్లిలో ఉత్సవ విగ్రహాల పల్లకీ మోస్తున్న భక్తులు



ఖమ్మంఅర్బన్: ఇందిరానగర్ పర్ణశాల రామాలయంలో శమీపూజలో పాల్గొన్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి దంపతులు



తిరుమలాయపాలెం: ఎదుళ్లచెరువులో దుర్గామాత విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం



కామేపల్లి: పింజరమడుగులో పాండవుల ప్రతిమలను ఊరేగిస్తున్న గ్రామస్తులు



కూసుమంచి: గట్టుసింగారంలో అమ్మవారి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు



ఖమ్మంఅర్బన్: మధురానగర్‌లో కోలాటం ఆడుతున్న మహిళలు



ఖమ్మంఅర్బన్: 4వ డివిజన్ యూపీహెచ్ కాలనీ అభయ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో..



కూసుమంచి: కేశ్వాపురంలో బతుకమ్మ వేడుకలో పాల్గొన్న గ్రామస్తులు

క్లుప్తంగా

నేడు అమ్మవారి నిమజ్జనం

ఖమ్మంగాంధీచౌక్: సెప్టెంబర్ 22 నుంచి శరన్నవరాత్రులు పూజలందుకున్న అమ్మవారి నిమజ్జన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేసుకున్నారు. నగరంలో శనివారం సాయంత్రం మేళతాళాలతో అమ్మవారిని ఊరేగిస్తూ మున్నేరులో నిమజ్జనం చేయనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

మళ్లీ విధుల్లో చేరిన జవాన్, బిల్ కలెక్టర్

ఖమ్మంమయూరిసెంటర్: ఈ నెల 1న కేఎంసీ జవాన్‌గా బుర్రి వెంకటేశ్వర్లు, బిల్ కలెక్టర్‌గా బుర్రి నాగేశ్వరరావులు విధుల్లో మళ్లీ చేరారు. వీరు సత్తుపల్లి, మధిర మున్సిపాలిటీలకు గతంలో బదిలీపై వెళ్లగా.. రెండు నెలల క్రితం కేఎంసీకి డిప్యూటేషన్‌పై వచ్చారు. వీరిపై పలు ఆరోపణలు రావడంతో గత నెల కేఎంసీ కమిషనర్ వీరిని రిలీవ్ చేస్తూ ఆదేశాలు ఇచ్చారు. తాజాగా డీఏఎం ఉత్తర్వులతో మరోసారి కేఎంసీకి డిప్యూటేషన్‌పై వచ్చి కమిషనర్‌ను కలిసి విధుల్లో చేరారు.

ఆర్థికసాయం అందజేత

కామేపల్లి: మండలంలోని పింజరమడుగు గ్రామానికి చెందిన రాయల కోటయ్య గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందాడు. ఈమేరకు బాధిత కుటుంబానికి తోటి స్నేహితులు రూ.5 వేల నగదు, 25 కేజీల బియ్యాన్ని అందించారు.

అయ్యప్ప మాలధారులకు అన్నదానం

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మంలోని 60వ డివిజన్ రామన్నపేట కాలనీలో శుక్రవారం అయ్యప్ప మాలధారణ చేశారు. వారికి తొలి రోజు పురస్కరించుకుని కాలనీలోని బొమ్మ స్వామి గుడిలో మాలధారుడు గొలుసుల తిరుమలరావు సమక్షాన పూజలు చేసి, 1వ డివిజన్ ఖైకొండాయిగూడెం కాంగ్రెస్ నాయకుడు నాగటి ఉపేందర్ ఆధ్వర్యాన అన్నదానం చేశారు.

వస్త్రదానం, అన్నదానం



దుస్తులు అందిస్తున్న చైర్మన్, తదితరులు

ఖమ్మంగాంధీచౌక్: దసరా సందర్భంగా నగరంలోని గాంధీచౌక్ వరప్రదాత షిర్డీ సాయి మందిరంలో 500 మంది పేదలకు వస్త్రదానం, 2 వేల మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలకు చీరలు, పురుషులకు లుంగీలు, దోవతులు, కండువాలను పంపిణీ చేశారు. సాయి మందిరం చైర్మన్ వేములపల్లి వెంకటేశ్వరరావు ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో కార్యదర్శి అర్వపల్లి నిరంజన్, కోశాధికారి కురువెళ్ల జగన్మోహన్‌రావు, డీవీడీ ప్రసాద్, కాకరపర్తి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రూ.5లక్షలతో ఆంజనేయ స్వామి ఆర్చి నిర్మాణం



ఆర్చి వద్ద కుటుంబీకులు

ఖమ్మం గాంధీచౌక్: నగరంలోని గుట్టలబజార్‌లో ప్రసిద్ధ ఆంజనేయస్వామి ఆలయ ఆర్చిని కీర్తిశేషులు నున్నా నర్సింహారావు జ్ఞాపకార్థం ఆయన కుటుంబీకులు గురువారం పూజ కార్యక్రమాల మధ్య ప్రారంభించారు. సుమారు రూ.5లక్షలతో నర్సింహారావు భార్య రాజేశ్వరి, కుమారుడు శ్రీకాంత్, అనురాధ దంపతులు వారి కుమార్తె జయంతిక నిర్మించగా.. వ్యాపార ప్రముఖులు కోప్పు నరేష్ లక్ష్మి దంపతులు, చిరంజీవి, మాధురి, ఆర్.భరద్వాజ్‌రెడ్డి సహకారం అందించినట్లు దాతలు పేర్కొన్నారు.

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	24	బచ్చలికూర	4
వంకాయ	46		20
బెండకాయ	20	పాలకూర	3
పచ్చిమిర్చి	46		20
కాకర	30	చుక్కకూర	3
బోడ కాకర	120		20
బీర	56	తోటకూర	4
దొండ	46		20
పొట్లకాయ	30	గోంగూర	4
చిక్కుడు	56		20
గోరుచిక్కుడు	56	మెంతికూర	3
క్యాబేజీ	28		20
క్యాలీఫ్లవర్	35	కొత్తిమీర	1
ఆలుగడ్డ	24		40
చామగడ్డ	30	పుదీన	1
క్యారెట్	46		20
క్యాప్సికం	70	-ఖమ్మం వ్యవసాయం	

జాతి గౌరవాన్ని నిలబెట్టాలి

● మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంయూరిసెంటర్: సమాజం అభివృద్ధి చెందాలంటే అందరూ కలసికట్టుగా ముందుకు రావాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఖమ్మంలో గురువారం జరిగిన కమ్మ మహాజన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సభకు ముందు మంత్రి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పరుచూరి వెంకటేశ్వరరావు, స్వతంత్ర్య లక్ష్మి దంపతులు స్కిల్ సెంటర్ నిర్మాణానికి అందించిన రూ.40 లక్షల విరాళం అభినందనీయమని, ఆ నిధులను పారదర్శకంగా వినియోగించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఉపయోగపడేలా చూడాలని ఆయన సూచించారు. వారి త్యాగం భవిష్యత్ తరాలకు ఆదర్శమని అభినందించారు. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన గ్రూప్–1 ఫలితాల్లో విజయం సాధించిన అభ్యర్థులను తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేకంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్సీ తాతా మధు, టీజీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, మేయర్ పునుకొల్లు నీరజ, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు ప్రసంగించారు. కమ్మ మహాజన సంఘం అధ్యక్షుడు కొల్లు రఘు సత్యనారాయణ, కార్యదర్శి చావా రాము, ఉపాధ్యక్షులు కర్నాటి రమాదేవి, సహాయ కార్యదర్శి వజ్జా శ్రీనివాసరావు, కోశాధికారి తుళ్లూరి నిర్మలా కుమారి, కార్యవర్గ సభ్యులు మోతుకూరి సత్యనారాయణ, మేదరమెట్ల స్వరూపరాణి, నల్లమల ఆనంద్, సత్యనారాయణ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

జరిమానా

ఖమ్మంమయూరిసెంటర్: అక్టోబర్ 2న గాంధీ జయంతిని పురస్కరించుకుని నగరంలో హోటళ్లు, మాంసం దుకాణాలు తెరవద్దని, బిర్యానీలు విక్రయించొద్దని నోటీసులు ఇచ్చినా కొంతమంది తెరిచి విక్రయాలు జరపడంతో కేఎంసీ అధికారులు తనిఖీలు చేసి జరిమానాలు విధించారు. పదుల సంఖ్యల మాంసం విక్రయదారులకు, ఓ బిర్యానీ హోటల్ నిర్వాహకులకు కలిపి మొత్తం రూ.30 వేల జరిమానా విధించినట్లు కేఎంసీ శానిటరీ సూపర్‌వైజర్ ఎం.సాంబయ్య తెలిపారు. అనంతరం దుకాణాలకు మూసివేయించారు.

సర్పంచ్ రిజర్వేషన్ మార్చాలి



సమావేశంలో పాల్గొన్న తండావాసులు

కూసుమంచి: మండలంలోని ధర్మాతండా గ్రామ పంచాయతీ సర్పంచ్ రిజర్వేషన్‌ను బీసీ నుంచి ఎస్టీగా మార్చాలని తండావాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం తండాలో నిర్వహించిన సమావేశంలో తండా పెద్దలు, యువత మాట్లాడుతూ... తమ తండాలో కేవలం ఒక్కటే బీసీ కుటుంబం ఉండగా.. వారికే సర్పంచ్ పదవిని రిజర్వ్ చేయడం అన్యాయమన్నారు. తమ రిజర్వేషన్‌ను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో పాటు అధికారులు పునఃపరిశీలన చేయాలని విజ్ఞప్తి చేశారు. లేకుంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

నిరుపేద విద్యార్థినికి ఎంబీబీఎస్ సీటు



తల్లిదండ్రులతో విద్యార్థిని రూపశ్రీ

రఘునాథపాలెం: మండలంలోని ఈర్లపూడి గ్రామానికి చెందిన నిడిగొండ వెంకటేశ్వర్లు, వసంతల కుమార్తె రూపశ్రీ ఎంబీబీఎస్ సీటు సాధించింది. మైనారిటీ గురుకుల కళాశాలలో చదువుకున్న ఆ విద్యార్థిని తండ్రి బార్బర్ వృత్తితో కొనసాగుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలో తల్లిదండ్రుల ప్రోత్సాహంతో వరంగల్ ప్రతిమ మెడికల్ కాలేజీలో సీటు పొందింది. అడ్వకేట్ ధరావత్ ప్రసాద్, ఈర్లపూడి గ్రామస్తులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

క్రైం కార్నర్

విద్యుత్ షాక్‌తో వ్యక్తికి తీవ్ర గాయాలు

నేలకొండపల్లి: మండలంలోని మంగాపురంతండాకు చెందిన తేజావత్ ధన్‌సింగ్ రహదారి వెంట చెట్టు కొమ్మలు నరుకుతున్నాడు. ఈక్రమంలో విద్యుత్ వైర్ తెగగా.. విద్యుత్ తీగలకు లైన్ కలుపుతున్న సమయాన ప్రమాదవశాత్తు షాక్ తగిలి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం ఖమ్మానికి తరలించారు.

బైక్ అదుపు తప్పి..

ఖమ్మానికి చెందిన నాగరాజు నేలకొండపల్లి నుంచి ఖమ్మం వైపు వెళ్తున్నాడు. ఈక్రమంలో నేలకొండపల్లి చెరువు కట్ట వద్దకు రాగానే బైక్ అదుపు తప్పి తీవ్ర గాయాలయ్యాయి. ఇదే సమయాన అటు వెళ్తున్న స్థానిక ప్రభుత్వ వైద్యాధికారి రాజేష్ క్షతగాత్రుడికి వైద్య పరీక్షలు నిర్వహించాక ఖమ్మం తరలించారు.

రోడ్డు ప్రమాదంలో మరొకరికి..

తిరుమలాయపాలెం: మండలంలోని తిరుమలాయపాలెం పెట్రోల్ బంక్ సమీపాన ఫ్రూట్స్ షాప్ వద్ద రోడ్డు ప్రమాదానికి గురై ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం మండలంలోని ఏలువారిగూడెం గ్రామానికి చెందిన ఉపేందర్ తన మోటార్ సైకిల్‌పై వెళ్తూ రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ఈమేరకు స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

దాడి ఘటనలో కేసు నమోదు

రఘునాథపాలెం: భార్యాభర్తలపై దాడి చేసిన ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు రఘునాథపాలెం పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. సీఐ ఉస్మాన్ షరీఫ్ కథనం ప్రకారం.. నగరంలోని బల్లేపల్లికి చెందిన కాపర్తి కిశోర్, భార్యతో కలిసి ఈర్లపూడి నుంచి కారులో ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో ఈర్లపూడి పంచాయతీ కార్యాలయం సమీపాన పశువులు ఎదురుగా రావడంతో కిశోర్ వాహనాన్ని ఆపాడు. ఇదే సమయాన రాంక్యాతండాకు చెందిన బోడ వెంకటేశ్వర్లు వారితో వాగ్వాదానికి దిగాడు. ఆ తర్వాత కిశోర్ దంపతులపై దాడి చేసినట్లు కిశోర్ ఫిర్యాదు చేయగా.. వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

యువకుడికి దేహశుద్ధి

నేలకొండపల్లి: యువతితో దురుసుగా ప్రవర్తించిన యువకుడిని చితకబాదిన ఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికంగా ఓ టిఫిన్ సెంటర్ వద్ద పార్కింగ్ విషయమై జరిగిన వాగ్వాదంలో నేలకొండపల్లికి చెందిన రమేష్ ఓ యువతి పట్ల దురుసుగా ప్రవర్తించగా ఆమె సంబంధీకులు దాడి చేశారు. ఈక్రమాన స్థానికులు దాడిని అడ్డుకోగా వివాదం జరిగింది. కాగా, దాడితో రమేష్ స్పృహ తప్పి పడిపోగా ఆయనను స్నేహితులు ఆస్పత్రికి తీసుకెళ్లారు.

'మూర్తి అన్న' మనుషులమంటూ దాడి

ఖమ్మంఅర్బన్: ఖమ్మం శ్రీనగర్‌కాలనీ రోడ్డు నంబర్–16లో గురువారం ఓ వ్యక్తిపై కొందరు హత్యాయత్నానికి పాల్పడ్డారు. శ్రీనగర్ కాలనీకి చెందిన గోలెపు గణేష్ ఇంటికి దసరా శుభాకాంక్షల పేరిట వెళ్లిన ఇల్లెందుకు చెందిన మహేష్, ఆయన అనుచరులు బీర్ బాటిళ్లతో దాడి చేశారు. 'నగరంలో నీ పేరు బాగా వినపడుతోంది.. కాల్వొడ్డులో నేను, భద్రుల్లా మూర్తి అన్న అనుచరులం... అన్న అంటే పోలీసులకే హడల్'అంటూ దూషిస్తూ దాడి చేయగా గాయాలయ్యాయని గణేష్ వెల్లడించారు. ఈమేరకు బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఖమ్మం అర్బన్ పోలీసులు తెలిపారు.

కాంగ్రెస్ అన్ని స్థానాల్లో విజయం సాధించాలి



పార్టీ కండువా కప్పుతున్న మంత్రి శ్రీనివాసరెడ్డి

నేలకొండపల్లి: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అన్ని స్థానాల్లో విజయం సాధించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. మండలంలోని రాజేశ్వరపురం గ్రామానికి చెందిన మోటాపురం ఎత్తిపోతల పథకం చైర్మన్ దండా హరిబాబు తన అనుచరులతో గురువారం మంత్రి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వీరికి మంత్రి కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించి, సమన్వయంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయ దుందుబి మోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్, కొడాలి గోవిందరావు, బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల అంజిని, దండా పుల్లయ్య, ఎర్రబోయిన నర్సయ్య, నల్లాని మల్లికార్జున్‌రావు, కొమ్మినేని పుల్లమ్మ, పాకనాటి కన్నారెడ్డి, కొమ్మినేని విజయ్‌బాబు, కొచ్చేర్ల శ్రీనివాసరావు, వీరెల్లి నాగరాజు, దండా నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు



మృతదేహాల వద్ద శ్రీనివాసరావు, తదితరులు

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఇటీవల మృతి చెందిన ఇద్దరి మృతదేహాలను ప్రభుత్వ పెద్దాస్పత్రిలో మార్చురీలో భద్రపరిచారు. వీరి కోసం ఎవరూ రాకపోవడంతో అనాథ శవాలుగా భావించిన పోలీసులు, వైద్య సిబ్బంది అన్నం ఫౌండేషన్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు ఆధ్వర్యాన మృతదేహాలకు బల్లేపల్లి వైకుంఠధామంలో శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు.

సన్నాహక సమావేశాన్ని జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న జానీమియా

ఖమ్మంమయూరిసెంటర్: సీపీఐ శత వసంతాల ముగింపు ఉత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 5న నిర్వహించే ఆహ్వాన సంఘ సన్నాహక సమావేశాన్ని జయప్రదం చేయాలని పార్టీ ఖమ్మం నగర కార్యదర్శి షేక్ జానీమియా అన్నారు. శుక్రవారం ఖమ్మంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు ఖమ్మంలోని ఎస్ఆర్ గార్డెన్స్‌లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన సమావేశం జరగనుండగా.. సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా పాల్గొని వేడుకల నిర్వహణకు దిశ నిర్దేశం చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు మహ్మద్ సలాం, మేకల శ్రీనివాసరావు, పగడాల మల్లేష్, యానాల సాంబశివారెడ్డి, పోటు కళావతి, వరదా నర్సింహారావు, నూనె శశిధర్, షేక్ సైదా, తాటి నిర్మల తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల ఐక్యతకు విఘాతం..



సదస్సులో మాట్లాడుతున్న సాయిబాబు

ఖమ్మం మామిళ్లగూడెం: ప్రపంచ దేశాల్లో పెట్టుబడిదారీ పాలకులు నయా ఉదారవాదాన్ని అమలు చేస్తూ కార్మికవర్గం ఐక్యతకు విఘాతం కలిగిస్తున్నారని, కార్మికవర్గాన్ని వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ (డబ్ల్యూఎఫ్‌టీయూ) చైతన్యం చేస్తుందని సీఐటీయూ అఖిలభారత కోశాధికారి మందలపు సాయిబాబు తెలిపారు. శుక్రవారం ఖమ్మంలో సీఐటీయూ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యాన నిర్వహించిన డబ్ల్యూఎఫ్‌టీయూ వార్షికోత్సవ సదస్సులో ఆయన మాట్లాడారు. భారతదేశంలో పాలకులు కులం, మతం, ప్రాంతం పేరుతో ప్రజలకు కార్మికులను విడదీసి దోచుకుంటున్నారని, అట్టి విధానాలకు వ్యతిరేకంగా సీఐటీయూ అనుబంధ యూనియన్లు రివల్యూషనరీ సంఘాలుగా తీర్చిదిద్దాలని, అప్పుడే విప్లవం జయప్రదమై ఎర్రజెండా అధికారంలోకి వస్తుందన్నారు. జిల్లా అధ్యక్షుడు తుమ్మా విష్ణు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కళ్యాణం వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు చలమాల విఠల్‌రావు, మల్లూరు చంద్రశేఖర్, శీలం నరసింహారావు, ముదాం శ్రీనివాసరావు, వై.విక్రమ్, కళ్యాణ్, జెల్లా రపు మంగ, ప్రసాద్, అనుమోలు రామారావు, భూక్యా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గాంధీ మార్గం అనుసరణీయం



మాట్లాడుతున్న అదనపు డీసీపీ ప్రసాద్‌రావు



కామేపల్లిలో గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఖమ్మంరూరల్: ప్రతి ఒక్కరికీ మహాత్మాగాంధీ శాంతి, అహింసా మార్గం అనుసరణీయమని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (లాఅండ్‌ఆర్డర్) కే.ఆర్.ప్రసాదరావు అన్నారు. గురువారం రామన్నపేటలో గల జిల్లా జైలు ఆవరణలో గాంధీ జయంతిని పురస్కరించుకుని మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గాంధీజీ చూపిన అహింసామార్గంలో ఖైదీలు తమ ప్రవర్తనలో మార్పు తెచ్చుకొని సమాజంలో గౌరవంగా జీవించాలన్నారు. జైలు సూపరింటెండెంట్ శ్రీధర్ మాట్లాడుతూ.. ఖైదీలకు వారి ఇష్టానుసారం తమ నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి వివిధ వృత్తులలో తర్ఫీదు ఇచ్చి పనులు చేయిస్తున్నట్లు తెలిపారు. జైలు ఆవరణలో పెట్రోల్‌బంక్ ఏర్పాటు చేసి ఖైదీలకు ఉపాధి కల్పించడంతో పాటు జైలుకు కూడా కొంత ఆదాయం సమకూరుతోందని, వారికి అవసరమైన వైద్యాన్ని కూడా సకాలంలో అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జైలర్లు అజ్మీరా సక్రునాయక్, జి.లక్ష్మీనారాయణ, డిప్యూటీ జైలర్లు ఎ.సుబాష్, కె.హనుమంతరావు, జైలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

'భగీరథ' వాగుపాలు..

నగరంలోని 10వ డివిజన్ చైతన్యనగర్‌లో ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ పైప్‌లైన్ నుంచి తాగునీరు వృథాగా పోతోంది. ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన నీరు అందించాలన్న లక్ష్యంతో ప్రతీ ఇంటికి కనెక్షన్ ఇస్తే కొంతమంది నివాసులు వినియోగించకపోవడంతో నీరు ఇదిగో ఇలా వాగుల్లో కలుస్తోంది. 'ప్రజల నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల మిషన్ భగీరథ నీరు వాగు, మురుగుకాల్వల పాలు అవుతోందని స్థానికులు వాపోతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి నీరు వృథా కాకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

- ఖమ్మంఅర్బన్



వృథాగా పోతున్న భగీరథ నీరు